క్లుప్తంగా

డిప్యూటీ తహసీల్దార్‌గా హరిశ్చంద్రప్రసాద్


బాధ్యతలు స్వీకరిస్తున్న హరిశ్చంద్రప్రసాద్

ఆత్మకూర్(ఎస్) : మండల డిప్యూటీ తహసీల్దార్‌గా హరిశ్చంద్ర ప్రసాద్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బదిలీల్లో భాగంగా అప్పటి డిప్యూటీ తహసీల్దార్ బదిలీపై వెళ్లగా నేటికీ ఖాళీగానే ఉంది. దీంతో కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్న హరిశ్చంద్ర ప్రసాద్‌ను మండల డిప్యూటీ తహసీల్దార్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఏఓ శశిధర్‌రెడ్డి మార్క్‌ఫెడ్‌కు బదిలీ


శశిధర్‌రెడ్డి ఏఓ

అర్వపల్లి : జాజిరెడ్డి గూడెం మండల వ్యవసాయ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న రావి శశిధర్‌రెడ్డి హైదరాబాద్‌లోని మార్క్‌ఫెడ్ సంస్థకు మంగళవారం బదిలీ అయ్యారు. ఆయన రెండేళ్ల నుంచి మండల ఏఓగా పనిచేస్తున్నారు. సూర్యాపేటలోని ఏడీఏ కార్యాలయంలో ఏఓగా విధులు నిర్వర్తిస్తున్న కె.మల్లారెడ్డి మండల ఏఓ బాధ్యతలు చేపట్టనున్నారు.

తాటిచెట్టుపై పిడుగు

అర్వపల్లి : మండల పరిధిలోని కొమ్మాల గ్రామంలో సోమవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. దీంతో గ్రామశివారులోని గుర్రాలడొంక వద్ద తాటిచెట్టుపై పిడుగు పడి కొద్దిసేపు మంటలు లేచాయి. అయితే ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

వర్షాలు కురవాలని వరుణుడికి పూజలు


చుట్టుకాముడు ఆడుతున్న మహిళలు


ఆత్మకూర్(ఎస్) : వర్షాలు కురవాలని, పంటలు పండాలని వానదేవుడిని వేడుకుంటూ మంగళవారం మండల పరిధిలోని పాతర్లపహాడ్‌లో మహిళలు పూజలు చేశారు. మూడు రోజులుగా వర్షాలు కురవాలని వేడుకుంటూ రైతులు, మహిళలు ఇంటింటికి తిరుగుతూ పాటలు పాడుతూ ఆటలు ఆడారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి


ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మురహరిని సన్మానిస్తున్న బాలకృష్ణ

నాగారం : కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మురహరి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికుల సమస్యలపై, వారి హక్కుల సాధనకు సంఘం ముందుంటుందన్నారు. త్వరలోనే సంఘం మండల కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడు అలకుంట్ల బాలకృష్ణ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు మురహరిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సాయిబాబా, శ్రీనివాస్, భాస్కర్, అందే బాలరాజు, పానుగంటి గణేష్, తీగుళ్ల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ


సైదులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కరుణాకర్ తదితరులు

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని చీదెళ్ల గ్రామానికి చెందిన టీయూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు లచ్చిమళ్ల వెంకన్న తండ్రి లచ్చిమళ్ల సైదులు అనారోగ్యంతో మృతి చెందాడు. మంగళవారం మృతుడి కుటుంబాన్ని మాజీ ఎంపీటీసీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోళ్ల కరుణాకర్ పరామర్శించారు. అనంతరం మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట రాష్ట్ర నాయకులు పల్స వెంకటేష్ నేత, బీసీ సంఘం రాష్ట్ర నాయకులు బొర్ర అరుణ్‌కుమార్, జనార్దన్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలతో జాగ్రత్త

- కొనుగోలులో అప్రమత్తంగా ఉండాలంటున్న వ్యవసాయాధికారులు
- ఆకర్షణీయ ప్రకటనలతో మోసపోవద్దు


నాగారంలో ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న సీఐ రఘువీర్‌రెడ్డి

నాగారం : ఈ ఏడాది కోటి ఆశలతో అన్నదాతలు వానాకాలం సాగుకు సన్నద్ధమవుతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు సమకూర్చుకోవాల్సిన సమయం ఇది. మార్కెట్‌లో ఆయా ఉత్పత్తులకు సంబంధించి ఆయా కంపెనీల ప్రకటనలు రైతులను ఊరిస్తున్నాయి. విత్తనం కల్తీదైతే మొలకెత్తక ముందే రైతు చిత్తవుతాడు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే ముందు వ్యవసాయశాఖ అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవడం చాలా అవసరమని గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు.

సాగుకు సన్నద్ధం..

వానాకాలం పంట సాగులో భాగంగా రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ సమయంలో పలు రకాల కంపెనీలకు చెందిన విత్తనాలు, పురుగు మందుల ప్రచారం ఊపందుకుంది. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ కంపెనీలు ఆకర్షణీయమైన ప్రకటనలు, ప్రచార ఆర్భాటాలతో రైతులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాయి. విత్తు కొద్ది పంట అన్న నానుడిని దృష్టిలో పెట్టుకొని నాణ్యమైన విత్తనాల కోసం రైతులు ఆరా తీస్తున్నారు. ఎరువులైనా, విత్తనాలైనా రైతులు ఈ సమయంలో చాలా అప్రమత్తమై ఉండాలి. ఒకటికి రెండు సార్లు ఆలోచించి అధికారుల సూచనలతో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయడం మంచిది.

మోతాదుకు మించితే నష్టాలే..

రైతులు అధిక దిగుబడులపై కోటిఆశతో విత్తనాలతో పాటు ఎరువులు మోతాదుకు మించి వినియోగిస్తారు. ఇలా చేయడంతో పంట దిగుబడి మాట దేవుడెరుగూ.. నష్టాలనే చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, పురుగు మందుల విషయంలోనూ మోతాదుకు మించొద్దని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. నేలల స్వభావాన్ని బట్టి పంటల ఎదుగుదల, చీడపీడల ఉధృతి ఉంటుందని చెబుతున్నారు. భూమి పోషకాలను బట్టీ ఎరువులు, పురుగు మందులు వేయడం ఉత్తమమంటున్నారు. ఒకరిని చూసి మరొకరు ఒకేరకం పంట, విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల వేయకూడదు. ఇలా చేస్తే మొదటికే మోసం వస్తుందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

కొనుగోలు ఇలా..

- లెసెన్స్‌డ్ దుకాణాల్లోనే ఎరువులను, విత్తనాలను కొనగోలు చేయాలి. కొనుగోలు చేసిన వాటి బిల్లులను, ఖాళీ సంచులను పంట కాలం పూర్తయ్యేవరకు జాగ్రత్తగా ఉంచాలి.
- మిషన్ కట్టుతో ఉన్న ఎరువుల సంచులనే వాడాలి. ఒక వేళ చేతికుట్టుతో ఉంటే సీసం సీల్ ఉందో లేదో చూసుకోవాలి. ప్రామాణిక పోషకాల వివరాలు, ఉత్పత్తి సంస్థ, ఉత్పత్తిదారుడి పేరు ఖచ్చితంగా ఉండాలి.
- కొనుగోలు సమయంలో డీలర్ రికార్డులో రైతు విధిగా సంతకం చేయాలి. ఎరువుల నాణ్యతపై అనుమానం ఉంటే తక్షణం వ్యవసాయశాఖ అధికారులతో ఎరువులను పరీక్షించుకోవాలి.
- చిల్లులు పడి చిరిగిన ఎరువుల బస్తాలు కొనుగోలు చేయవద్దు. ఇతర పదార్థాలు కలిస్తే ఆ ఎరువును కల్తీగా గుర్తించాలి.

లైసెన్స్ డీలర్ల వద్దే కొనుగోలు చేయాలి



రైతులు ఎరువులు, విత్తనాల కొనుగోళ్ల విషయంలో తప్పని సరిగా స్థానికంగా ఉన్న లైసెన్స్ పొందిన డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలి. రైతులు ఇతర ప్రాంతాల్లో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేస్తే ఒకవేళ పంట నష్టం జరిగినప్పుడు నష్టపరిహారం ఇప్పించడానికి ఇబ్బందులు ఎదురవుతాయి. గ్రామాల్లో సంచరిస్తూ వాహనాల్లో ఎరువుల, విత్తనాలు విక్రయించే వారి వద్ద కొనుగోలు చేయవద్దు. విత్తన నాణ్యత లోపిస్తే పంట దిగుబడికి ముప్పు వాటిల్లుతుంది. వ్యవసాయశాఖ అధికారుల సలహాలు, సూచనలతో పంటలను సాగు చేసుకోవాలి.

– పెందోట గణేష్, ఏఓ నాగారం

‘సీపీయూఎస్‌ఐ’తోనే దళితులకు రాజ్యాధికారం


సభలో మాట్లాడుతున్న కోదండం

ఆత్మకూర్(ఎస్) : సీపీయూఎస్‌ఐ పార్టీతోనే దళిత బహుజనులకు రాజ్యాధికారం సాధ్యమని, సబ్బండ కులాలకు రాజ్యాధికారం దక్కాలని, అనగారిన కులాలను ఐక్యం చేసిన మారోజు వీరన్న ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ పోరాడాలని సీపీయూఎస్‌ఐ కేంద్ర కమిటీ సభ్యుడు పగడాల కోదండం అన్నారు. సోమవారం రాత్రి మండల పరిధిలోని ముక్కుడుదేవులపల్లి గ్రామంలో నిర్వహించిన సబ్బండ కులాలకు రాజ్యాధికారం బహిరంగ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. మారోజు వీరన్న కుల సంఘాలను నిర్మాణం చేసి, తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారని, నేడు కుల సంఘాలను నిర్వీర్యం చేసి మారోజు వీరన్న ఆశయాలను ముక్కలు చేయాలని కొందరు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం రామరాజ్యం పేరుతో ఆదివాసీలపై ఉక్కుపాదం మోపుతుంటే మరోపక్క రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. బహుజన రాజ్యంకై విద్యార్థులు, మేధావులు, కవులు, కళాకారులు కలిసి రావాలని, బూర్జువ పెట్టుబడిదారి వర్గాల దోపిడీని తుదముట్టించాలని పిలుపునిచ్చారు. సభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి దైద వెంకన్న, సామాజిక విశ్లేషకులు తీగల జీవన్, సి.రమేష్, భీమన్న, ఆరుట్ల జానకిరెడ్డి, పగడాల రమేష్, మట్టపల్లి లింగయ్య, వావిలాల లక్ష్మణ్, పిట్టల రాజమౌళి, బయ్య లింగమల్లు, భయ్యా వెంకన్న, జగదీష్, కృష్ణయ్య, నాగయ్య, ఉప్పలయ్య నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణం


తాళిబొట్టు చూపిస్తున్న వేదపండితులు

చివ్వెంల: జ్యేష్ఠమాస స్వాతి నక్షత్రం సందర్భంగా మండలంలోని ఉండ్రుగొండ గ్రామ శివారులోని గిరిదుర్గంలో వెలిసిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణాన్ని మంగళవారం వేదపండితులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు శ్రీమాన్ రవికుమారాచార్యులు, శ్రీమాన్ కృష్ణమాచార్యులు మంత్రోచ్చరణతో స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి కల్యాణతంతు జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు ఇచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చకిలం కృష్ణకుమార్, బంధకవి కృష్ణమోహన్, కట్టికోల మధుసూదన్‌రావు, గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణపై అవగాహన సదస్సు



తుంగతుర్తిలో మాట్లాడుతున్న హెచ్ఈఓ సముద్రాల సురేందర్

అర్వపల్లి : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఈనెల 20న జరిగే మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని విజయవతం చేయాలని అర్వపల్లి పీహెచ్‌సీ సీహెచ్‌ఓ ఎల్.చరణ్ కోరారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లకు నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2నుంచి 19ఏళ్ల లోపు వారికి మాత్రమే మాత్రలు పంపిణీ చేయాలని అన్నారు. మాత్రలు వేసుకోని పిల్లలకు ఈనెల 27న వేయాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

తుంగతుర్తి : ఈనెల 20న నిర్వహించే జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని హెచ్ఈఓ సముద్రాల సురేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని విశ్రాంతి ఉద్యోగుల భవనంలో వైద్య సిబ్బందికి, ఆశవర్కర్లకు, అంగన్‌వాడీ టీచర్లకు నులిపురుగుల నివారణ కార్యక్రమంపై నిర్వహించిన శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. 1నుంచి 18ఏళ్ల లోపు పిల్లలందరికి అల్బెండాజోల్ మాత్ర 400ఎంజీని వేయించాలన్నారు. పిల్లల జీర్ణాశయంలో నులిపురుగులు ఉండటంతో శరీరంలో రక్తహీనత, శారీరక, మానసిక ఎదుగుదల లోపించడం, అలసట వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ బోయిని లింగయ్య, పీహెచ్‌ఎన్‌లు సైదమ్మ, జానకమ్మ, వైద్యసిబ్బంది సోమన్న, నరసింహాచారి, విజయకుమార్, భూమిక, మౌనిక, సరిత ఆయా గ్రామాల ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.


అర్వపల్లి : అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీహెచ్‌ఓ చరణ్

సెంట్రల్ లైట్ల నిర్వహణపై పట్టింపేది?

- అంధకారంగా జాతీయ రహదారులు
- ఇబ్బందులు పడుతున్న వాహనచోదకులు, స్థానికులు

అర్వపల్లి : జాతీయ రహదారుల నిర్వహణలో కాంట్రాక్ట్ సమయం గడువు ముగియడంతో సెంట్రల్ లైట్ల నిర్వహణ అధ్వానంగా మారింది. అర్వపల్లిలో సూర్యాపేట–జనగామ, నకిరేకల్–తానంచర్ల రెండు జాతీయ రహదారులు ఉన్నాయి. అయితే ఈ రెండు హైవేలపై సెంట్రల్ లైట్లు వెలగక అర్వపల్లి అంధకారంగా మారింది. దీంతో వాహనచోదకులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాంట్రాక్టర్ గడువు ముగియడంతో అసెంబ్లీ ఎన్నికల ముందు నుంచి ఈ సెంట్రల్ లైట్లు సరిగ్గా వెలగడం లేదు. ఇప్పటికైనా సెంట్రల్ లైట్లకు మరమ్మతు చేయించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.


తుంగతుర్తి హైవేలో వెలగని హైమాస్ట్ లైట్లు


సూర్యాపేట-జనగామ హైవేపై అర్వపల్లి పోలీస్‌స్టేషన్ మార్గంలో..

భక్తిశ్రద్ధలతో ఆలయ ప్రథమ వార్షికోత్సవం


దూపహాడ్‌లో దేవతామూర్తుల కల్యాణంలో పాల్గొన్న భక్తులు

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని దూపహాడ్ గ్రామంలో గల శ్రీసీతారామచంద్రస్వామి, దుర్గా మహేశ్వర దేవాలయ ప్రథమ వార్షికోత్సవాలను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ బిట్టు నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకం, హోమం కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం దేవతామూర్తులను అందంగా పూలతో అలంకరించి దేవతామూర్తుల కల్యాణం నిర్వహించారు. కల్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సమసమాజ స్థాపనే కమ్యూనిస్టుల లక్ష్యం

మోతె : సమసమాజ స్థాపనే కమ్యూనిస్టుల లక్ష్యమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు అన్నారు. మంగళవారం మోతె మండల పరిధిలోని బుర్కచర్ల గ్రామంలో నిర్వహించిన మండల స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోపిడీ, పీడిత, వివక్షత, అనిచివేత ఉన్నంత కాలం కమ్యూనిజం అజేయంగా నిలుస్తుందన్నారు. దేశ భవిష్యత్‌ను మార్చేది సోషలిజమే అని అన్నారు. పాలకులు అనుసరించే ప్రజా వ్యతిరేక విధానాలపై గర్జించేది కేవలం కమ్యూనిస్టులేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో మట్టిపెల్లి సైదులు, కాంపాటి శ్రీను, కొక్కిరేణి సత్యనారాయణ, కొండ రాములు, లింగయ్య, మధు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


తిరుమలగిరి : విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసులు


అర్వపల్లి : పుస్తకాలు, యూనిఫాంతో రామన్నగూడెం పాఠశాల విద్యార్థులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని పాఠశాల హెచ్‌ఎం జి. శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఆయన పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులంతా కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులచే విద్యా బోధన ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జానయ్య, రాజు, వెంకన్న, సత్తిరెడ్డి, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో యూనిఫాం, పుస్తకాల పంపిణీ

అర్వపల్లి : మండల పరిధిలోని రామన్నగూడెం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలను హెచ్‌ఎం చిప్పలపల్లి ధర్మయ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు అన్ని వసతులు కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ తవిటి మమత, ఉపాధ్యాయులు బి.నీరజ, విజయలక్ష్మి, శైలజ, అంగన్‌వాడీ టీచర్ అనిరెడ్డి పుష్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట) : నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్ డిమాండ్ చేశారు. నీట్ పరీక్షపై స్పందించని ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను మంగళవారం జిల్లా కేంద్రంలో దహనం చేశారు. నీట్ పరీక్ష నిర్వహణ సరిగా లేదని, 67మందికి మొదటి ర్యాంక్ రావడం అనుమానాలకు తావిస్తుందన్నారు. దీనికి బాధ్యత వహిస్తూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ చైర్మన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సూరం విజయ్‌రెడ్డి, గణేష్, నిఖిల్, సిద్ధార్థ, వంశీకృష్ణ, సాయి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవ కవాతును జయప్రదం చేయాలి


రవిని సన్మానిస్తున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట) : వరంగల్‌లో జూలై 7న నిర్వహించే మాదిగల ఆత్మగౌరవ కవాతును జయప్రదం చేయాలని మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజన్న, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చింత వినయ్‌బాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని బాబు జగ్జీవన్‌భవన్‌లో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. త్వరలోనే కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఆత్మకూరు మండలానికి చెందిన ములకలపల్లి రవి నియమించారు. ఈ సందర్భంగా రవిని పార్టీ నాయకులు, కార్యకర్తలు సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కనుకుంట్ల వెంకన్న, రాజు, వెంకన్న, నవీన్, మేడి కృష్ణ, గోపి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని అనాజిపురం ఆదర్శ పాఠశాలలో గంటల ప్రాతిపదికన ఇంగ్లిష్, మ్యాథ్స్ సబ్జెక్టులు బోధించేందుకు ఖాళీగా ఉన్నట్లు ప్రిన్సిపల్ ప్రమీల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు బీఏ బీఈడీ, బీఎస్సీ బీఈడీ విద్యార్హతలతో పాటు టెట్ తప్పనిసరిగా ఉత్తీర్ణులైన అభ్యర్థులు వారి బయోడేటాతో పాటు సర్టిఫికెట్ల జిరాక్స్‌లను ఈనెల 21న పాఠశాలలో అందజేయాలని, ఈనెల 22న ఇంటర్వ్యూ, డెమో నిర్వహించి ఎంపిక చేయనున్నట్లు ఆమె వెల్లడించారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

పెన్‌పహాడ్ : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జరగనున్న మండల సర్వసభ్య సమావేశం కోరం లేకపోవడంతో మంగళవారం వాయిదా వేసినట్లు ఎంపీపీ నెమ్మాది భిక్షం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఇద్దరు ఎంపీటీసీలు, ఎంపీపీ మాత్రమే హాజరు కావడంతో వాయిదా పడినట్లు ఆయన వెల్లడించారు.

ఆలయంలో అన్నదానం

కోదాడరూరల్ : కోదాడ పట్టణ పరిధిలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో కొలువై ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దాతలు గురుస్వామి, అరుణ, సుజన్‌కుమార్, ఉపేందర్‌రావు, కృష్ణవేణి అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నెలవారి దాతలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా సబ్‌మార్కెట్ యార్డు

- 9ఏళ్లు కావస్తున్నా మొదలుకాని క్రయవిక్రయాలు
- 4ఎకరాల్లో రూ.1.55కోట్లతో నిర్మాణం
- సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే హామీ
- రెగ్యులర్ మార్కెట్‌గా చేస్తేనే అభివృద్ధి


నిరుపయోగంగా ఉన్న జాజిరెడ్డిగూడెంలోని వ్యవసాయ సబ్‌మార్కెట్ యార్డు

అర్వపల్లి : నకిరేకల్–తానంచర్ల జాతీయ రహదారిపై జాజిరెడ్డిగూడెంలో వద్ద నిర్మించిన వ్యవసాయ సబ్ మార్కెట్ యార్డు నిరుపయోగంగా మారింది. ఈ యార్డు నిర్మాణం జరిగి 9ఏళ్లు కావస్తున్నా ఇప్పటికీ క్రయ విక్రయాలు ప్రారంభం కాని దుస్థితి. దీనికి తోడు యార్డులో పూర్తిస్థాయిలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించకపోవడం సమస్యగా మారింది. 4ఎకరాల స్థలంలో 2015–16లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వ నీటిపారుదల శాఖ సలహాదారు, గ్రామ వాసియైన రామరాజు విద్యాసాగర్‌రావు కోరిక మేరకు ప్రభుత్వం వ్యవసాయ సబ్‌మార్కెట్ యార్డును రూ.1.55కోట్లతో నిర్మాణం చేపట్టింది. అయితే ఈ యార్డులో అన్ని వసతులు కల్పించకపోవడంతో నిరుపయోగంగా మారుతుంది.

యార్డులో చేపట్టాల్సిన పనులు..

ఈ యార్డులో ప్రస్తుతం ఒక్కటే షెడ్ ఉంది. అదనంగా షెడ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. అలాగే యార్డు స్థలంలో వర్షపు నీరు చేరి ఇబ్బందులు అవుతున్నాయి. యార్డు ఆవరణలో సీసీ నిర్మాణం, విద్యుత్, తాగునీటి వసతి, మరుగుదొడ్ల వినియోగం వంటి పనులు చేపట్టాల్సి ఉంది. ఇటీవల గ్రామ పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే సామేల్ దృష్టికి యార్డులోని సమస్యలను గ్రామస్తులు విన్నవించగా, యార్డులోని సమస్యలను త్వరలో పరిష్కరిస్తానని గ్రామస్తులకు ఇచ్చారు. ఈ హామీని నెరవేరితే యార్డు వినియోగంలోకి రానుంది. అలాగే రెగ్యులర్ వ్యవసాయ మార్కెట్ యార్డుగా మార్చాల్సి ఉంది.

నిర్మాణానికి ఎంతో పోరాడాం



ఈ ప్రాంతంలో వ్యవసాయ మార్కెట్ యార్డు లేకపోవడంతో రామరాజు విద్యాసాగర్‌రావు ద్వారా యార్డు మంజూరును చేయించి నిర్మాణం చేయించాం. దాతల సహకారంతో స్థలాన్ని కొనుగోలు చేసి ఏర్పాటు చేయించాం

– దాసరి సోమయ్య, గ్రామ నాయకుడు

రెగ్యులర్ మార్కెట్‌గా మార్చాలి



జాజిరెడ్డిగూడెంలో నిర్మించిన వ్యవసాయ సబ్‌మార్కెట్ యార్డును రెగ్యులర్ మార్కెట్ యార్డుగా మార్చాలి. అయితే ఈ యార్డులో కేవలం ప్రతి పంట సీజన్‌లో మాత్రమే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు.

– నాగమ్మ, ఎంపీటీసీ, జాజిరెడ్డిగూడెం

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం



గ్రామంలో నిర్మించిన వ్యవసాయ సబ్‌మార్కెట్ యార్డులో సమస్యలను ఎమ్మెల్యే సామేల్ దృష్టికి తీసుకెళ్లాం. సమస్యలన్నిటినీ దశల వారీగా పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సమస్యలు తీరితే రెగ్యులర్ మార్కెట్‌గా మారుతుంది.

– బింగి కృష్ణమూర్తి, గ్రామస్తుడు